# పురుషద్వేషి

బొమ్మిడి అచ్చారావు

కళ్ళార్పకుండా తదేక దీక్షతో ఆమె వైపే చూస్తూండిపోయాడు అనిల్. చందనం, బంగారం, రోజాపూలు, నవనీతం సమపాళ్ళలో కలిపి ఆమెను విధాత సృష్టించాడా అన్నంత సుకుమారంగా, అందంగా మనోహరంగా కన్నుల పండుగ చేస్తోంది.

ఆ హాల్లో తనూ ఆమె మాత్రమే కాక ఇంకా పెళ్ళిపెద్దలు, తన స్నేహితుడు, ఆ అమ్మాయి బంధువులు ఉన్నారన్న నిజాన్ని విస్మరించి కొద్ది నిమిషాలు ప్రలోభానికి లోనయ్యాడు అనిల్.

రాజేష్ మిత్రుడి భుజం తట్టి "అమ్మాయి నీకు బాగా నచ్చిందని నీ వాలకం చెప్పకనే చెబుతోంది. తాంబూలాలు పుచ్చేసుకుందామా?" అని చెవిలో గుసగుసలాడాడు.

స్వర్గపుటంచుల నుంచి ఒక్కసారిగా భూమ్మీదకు తోసేసినట్టనిపించింది అనిల్‌కి.

చిన్నగా సిగ్గుపడి, "పెళ్ళి వన్‌వే ట్రాఫిక్ కాదు. అమ్మాయికి కూడా ఇష్టాయిష్టాలుంటాయి కదా...! నేను నచ్చానో లేదో కనుక్కో!..." అన్నాడు అనిల్.

తను చూసిన ఆ కాసేపట్లోను ఆమెపట్ల చాలా సదభిప్రాయం కలిగింది. ఒక్కసారి కూడా ఆమె తలెత్తి తనవైపు చూడలేదు. సహజంగా ఆడపిల్లలకుండే బిడియం వల్లకావొచ్చు. అయితే పెళ్ళిచూపుల సమయంలో తనక్కాబోయే భర్త ఎలా వుంటాడో చూడాలనే కోరికను అణుచుకోలేని ఆడపిల్ల కనీసం క్రీగంటనయినా ఓసారి అతనివైపు చూస్తుంది. కానీ, ఈ అమ్మాయి అలాంటి ప్రయత్నమేదీ చెయ్యలేదు.

'ఆరడుగుల అందగాడివి; అయిదంకెల జీతం తెచ్చుకుంటున్నవాడివి; నలుగురిలోను బుద్ధిమంతుడవని, పెద్దమనిషివని పేరు తెచ్చుకున్నవాడివి' – నీలాంటివాడు భర్తగా రావాలని కోరుకోని ఆడపిల్ల; అల్లుడు కావాలని కోరుకోని అత్తమామలు; బావ కావాలని కోరుకోని మరదళ్ళు, బావమరది; స్నేహితుడు కావాలని కోరుకోని మిత్రులు ఉంటారా?..." రాజేష్ మిత్రుడివైపు ఆప్యాయంగా చూస్తూ అతని చెయ్యి మృదువుగా, ప్రేమగా నొక్కి వదిలాడు.

మిత్రుడి ఆప్యాయతానురాగాలకు పరవశించిపోయాడు అనిల్.

"మీరు అమ్మాయిని ఏమైనా అడగదలచుకుంటే అడగండి బాబూ!" పెళ్ళికుమార్తె తండ్రి వినయంగా అన్నాడు.

చాలా అడగాలనుంది అనిల్‌కి. గంటల తరబడి ఆమెతో కబుర్లు చెప్పకోవాలని వుంది. ఆమె నిలువెత్తు సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదించాలని వుంది. ఒక్కసారి ఆమె కళ్ళెత్తి తన కళ్ళలో కళ్ళు కలిపితే బావుండునని వుంది. ఇంకా చాలా చాలా కావాలని వుంది.

"పెళ్ళికొడుకు అడగటానికేదో బిడియ పడుతున్నట్టు కనిపిస్తోంది. బహుశా అందరిలో మాట్లాడటానికి సంకోచిస్తున్నాడేమో, కాస్త వారిరువురికి ఏకాంతం కలిగిస్తే బావుంటుంది" పెళ్ళి పెద్దల్లో ఎవరో అన్నారు.

ఆ మాటలకు ఆమె తొట్రుపడటం స్పష్టంగా గమనించాడు అనిల్. భీత హరిణేక్షణలా ఆమె కళ్ళు చలించటం గుర్తించాడు. కొద్దిక్షణాలు ఆ దృశ్యంలోని అందాన్ని ఆస్వాదించాడు.

అనిల్ ఆమె అవస్థ గమనించి వెంటనే అన్నాడు: "అబ్బే, అలాంటిదేం వద్దులెండి. మేము ఏకాంతంలో మాట్లాడుకునే విషయాలేం లేవు. ఏదేదో అందరూ ఉండగానే మాట్లాడుకుంటాం"

రాజేష్ చిన్నగా నవ్వి, "ఇందాకట్నుంచి చూస్తున్నాను ఏమీ మాట్లాడరేం మరి?" అనడిగాడు.

"మీ పేరేమిటి?" అడిగాడు అనిల్ అమ్మాయిని.

"హరిత" అన్నదామె పెదాలు విడీవిడనట్లుగా, ఆమె గొంతు చాలా శ్రావ్యంగా వుంది. అనిల్ మానసవీణను సుతారంగా మీటినట్లు వినిపించిందా ఒక్కమాట.


"మీకు పాటలు పాడటం వచ్చా, వంట చేయటం వచ్చా, డాన్స్ చేయటం వచ్చా అనే ప్రశ్నలేమీ అడగను. మీరు బి.ఎస్సీ గోల్డ్ మెడలిస్ట్ అనీ, కంప్యూటర్స్ చేశారనీ అవసరమైతే ఉద్యోగం చేసి నాకు చేదోడు వాదోడుగా వుంటారనీ, ముక్కుకు సూటిగా వ్యవహరించే స్వభావం కలవారనీ–రాజేష్ చెప్పాడు.

మళ్ళీ అవన్నీ ఇంతమందిలోను మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయటం, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నాకిష్టం లేదు. మీ గురించి నేను తెలుసుకోవటం ఎంత అవసరమో, నా గురించి మీరు తెలుసుకోవటం కూడా అంతే అవసరం. పెళ్ళికి ముందు ఒకరి ఇష్టాయిష్టాలు, అభిరుచులు, మనస్తత్వాలు రెండవ వారు తెలుసుకుని ఒకరినొకరు ఇష్టపడితేనే వారి భావి దాంపత్య జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోతుంది.. యూనో, ...నా పేరు అనిల్. నా గురించి మీరేం తెలుసుకోవాలనుకుంటున్నారో అడగండి, ప్లీజ్!" అన్నాడు అనిల్.

అంతదాకా తలెత్తి చూడని హరిత ఒకసారి తన సోగ కళ్ళను అలవోకగా పైకెత్తి, అనిల్ వంక మొదటిసారిగా చూసింది. తొలిచూపులోనే ఆమె మనసును అలరించింది–అతని మనోహర రూపం. అంతకన్న కూడా సంస్కారముట్టిపడే అతని మాటలు, ఆమె మనసుమ సూటిగా తాకాయి.

చుట్టూ ఉన్న పెళ్ళి పెద్దలకు కూడా అనిల్ సంస్కారం, విశాల హృదయం అవగతమయ్యాయి. సంతోషం కలిగించాయి.

హరిత మాత్రం గొంతువిప్పి ఒక్కమాట



కూడా అనలేదు. అది సంకోచమో, బిడియమో, భయమో అనిల్‌కర్థం కాలేదు.

హరిత పక్క కూచున్న ఆమె స్నేహితురాలు చిన్నగా ఆమె బుగ్గమీద చిటికె వేసి, "అబ్బాయి మన్మధుడిలా వున్నాడే!. .పైగా పెద్ద బ్యాంక్ ఆఫీసరు. అతనంతగా అడుగుతుంటే మాట్లాడవేంటి? నువ్వతనికి బాగా నచ్చావని అతని మాటలే చెవుతున్నాయి. మీరిద్దరు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా వున్నారు" అన్నది క్రీగంట అనిల్‌ని చూస్తూ.

అప్పటికీ హరిత ఏమీ మాట్లాడలేదు.

హరిత తల్లి కూతురు దగ్గరగా వెళ్ళి "ఏమైనా మాట్లాడమ్మా! అబ్బాయి చిన్నబుచ్చుకుంటాడు– నువ్వేమీ మాట్లాడకపోతే... పోనీ, మేమందరం బయటకు వెళ్ళేదా?..." అనడిగింది.


హరిత వెంటనే, "వద్దు, వద్దు...నాకేమీ అడగాలని లేదు. దయచేసి బలవంతం చెయ్యొవద్దు" అన్నది.

అనిల్ చెవులదాకా చేరాయి ఆమె మాటలు. ఆమెకు తనంటే ఇష్టం లేదా? ఈ కాలం ఆడపిల్లలు, అందునా డిగ్రీ చదివి, కంప్యూటర్ చేసిన అమ్మాయి– ఎంతో ఫాస్ట్‌గా అడ్వాన్స్‌డ్‌గా ఉండాల్సిన అమ్మాయి– మౌనంగా మూడీగా వుండిపోయిందంటే, ఆమెనెలా అర్థం చేసుకోవాలి?

బహుశా ఆమె మనసులో ఇంకెవరైనా అబ్బాయి ఉన్నాడా? తనంటే ఇష్టం లేదా? అందచందాలు, మంచి జీతమొచ్చే ఉద్యోగం, సంఘంలో హోదా, పేరు ప్రతిష్ఠలు– వీటికన్న కూడా అమ్మాయిల్ని ఆకర్షించే అంశాలు ఇంకా వేరే ఏవో వుండొచ్చు. తను మనస్ఫూర్తిగా ఇష్టపడ్డ మగాడిలో ఈ అంశాలేమీ లేకపోయినా, అమ్మాయిల్ని ఆకర్షించే అంశం మరేదో ఉండొచ్చు. అది అవతలివారి ఇష్టాయిష్టాల మీద, మనసు మీద ప్రభావం చూపించవచ్చు.

"హరితగార్ని బలవంతం చెయ్యకండి. ఆమెకు నాతో ఏకాంతంగా మాట్లాడటం ఇష్టం లేనట్టుంది. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరూ ప్రవర్తించవద్దని మనవి." అన్నాడు నమ్రతగా అనిల్.

హరిత తండ్రి వెంటనే అందుకొని, "అబ్బే, అమ్మాయికి ఇష్టం లేకపోవటం ఏమీకాదు బాబూ! ఎంత చదువుకున్నా, అమ్మాయి మొదట్నుంచీ మితభాషి. రిజర్వ్‌డ్‌గా ఉండే స్వభావం. తమరు మరోలా భావించవద్దని నా విన్నపం!" అన్నాడు అనిల్‌తో. ఇంతమంచి సంబంధం తప్పిపోతుందేమోనన్న భయం ఆయన మాటల్లో




లీలగా తొంగిచూసింది.

రాజేష్ హరిత దగ్గరగా వెళ్ళి "అమ్మా హారీ, అనిల్ నా బెస్ట్ ఫ్రెండ్. చాలా మంచివాడు. ఒక్క దురలవాటు కూడా లేనివాడు. లక్షల్లో ఎన్నదగ్గ వ్యక్తి. నా ప్రోద్బలంతోనే నిన్ను చూడాలని వచ్చాడు. వాడి మనసు గాయపరచవని నమ్ముతాను. అతను నిన్ను ఇష్టపడి చేసుకోవాలనుకుంటున్నాడు. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప, అతని లాంటి భర్త ఆడపిల్లకు దొరకదు. నీకు నచ్చకపోతే సూటిగా చెప్పెయ్యి. నీ మెడలు వంచి, నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఈ పెళ్లి చేయబోవటం లేదని నువ్వు గ్రహిస్తే చాలు?" అన్నాడు.

హరిత మౌనంగా అతను చెప్పిన మాటలన్నీ విన్నది. అనిల్ కూడా అనీజీగా ఫీలయ్యాడు. ఆమె ఇంకా ఎటూ తేల్చుకోలేని సందిగ్ధావస్థలో ఉన్నట్టు ఆమె ముఖకవళికల్ని బట్టి అర్థం చేసుకున్నాడు. నిర్ణయం తీసుకోవటానికి ఆమెకు సమయం పడుతుంది. హరిత అందరు ఆడపిల్లల వంటిది కాదని కూడా అతని కర్థమైపోయింది. ఆమె మనసులో ఏదో సంఘర్షణ జరుగుతోంది. పెళ్ళిచూపులకు తనను తీసుకురావటానికి ముందు రాజేష్ తనకు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

హరిత వ్యక్తిత్వం ఊహకందనిది. దృఢమైనది. అంత తొందరగా తేలిపోయే మనస్తత్వం కాదు అనుకున్నాడు అనిల్.

"హరిగారూ, మీరు నాకన్నివిధాలా నచ్చారు. నేను మీకు నచ్చానో లేదో ఇప్పుడే, ఇక్కడే చెప్పమని వేనడగను. మీ నిర్ణయాన్ని తర్వాత తెలియచెయ్యండి. మా పెద్దవాళ్ళ నుండి ఎటువంటి అభ్యంతరాలు ఉండవు. నా ఇష్టమే వారిష్టం...ఓ.కే! సెలవు" అంటూ లేచాడు అనిల్.

అతని ఉన్నత వ్యక్తిత్వం, సంస్కారం హరిత మనసును కుదిపేశాయి. వెంటనే చెప్పేసింది... "మీరంటే నాకిష్టమే!".. .అని! కాని, ఆమె పెదాలు ఆ మాటల్ని అతని చెవులదాకా చేర్చటంలో విఫలమయ్యాయి. మనసులోని మాట బయటకు రాలేదు.

హరిత తండ్రి, "బాబూ అమ్మాయిని మేము కనుక్కొని ఇప్పుడే చెపుతాం. మీరు వెళ్ళిపోకండి" ప్రాధేయ పూర్వకంగా నిలువరించాడు అనిల్ని.

రాజేష్ మిత్రుడ్ని సాదరంగా మళ్ళీ కూర్చుండబెట్టాడు.

హరిత లేచి నిల్చుంది. లోనికి వెళ్ళబోతూ, అలవోకగా అనిల్ వంక చూసింది. ఆ చూపుల్లో అతని పట్ల ఇష్టం, ఆరాధన, అంగీకారం స్పష్టంగా తొంగిచూశాయి. ఆమె చూపుల్లో తనూ చూపులు కలిపి, సమ్మోహనకరంగా నవ్వాడు అనిల్.

* * *

గదినిండా పరిమళాల గుభాళింపు. పరువుమీద మల్లెలు, సంపెంగలు, సన్నజాజులు గులాబీలు స్వాగతం పలుకుతున్నాయి. సెంటెడ్ అగరొత్తుల ధూపం మనసును మత్తెక్కిస్తుంటే తలుపువైపే చూస్తూ కూచున్నాడు అనిల్.

తలుపు చప్పుడయ్యింది. తన కలల దేవత సమ్మోహనకరమైన అలంకరణతో సాక్షాత్తు దివి నుంచి దిగివచ్చిన దేవకన్యలా మెరిసిపోతూ లోనికొచ్చి తలుపు గడియపెట్టి, అక్కడ నిల్చుండిపోయింది.

అనిల్ పక్కమీది నుంచి దిగి ఆమెవైపు మెల్లగా అడుగులు వేశాడు. ఆమె చేయి ఎందుకో వణుకుతోంది. చేతిలోని పాల గ్లాసు కింద పడేలా అనిపించి చటుక్కున గ్లాసందుకుని టీపాయ్ మీద పెట్టాడు అనిల్.

తలస్నానం చేసిన కురులు ఫ్యాన్ గాలికి అలవోకగా ఎగురుతూ ఆమె ముఖానికి కొత్త అందాన్ని సోయగాన్ని తెచ్చిపెట్టాయి. అసలే ఎర్రటి ముఖం, సిగ్గుతెచ్చి, పెట్టిన గులాబీ రంగును పులుముకుని మరింత ఎర్రబడింది. గుండ్రటి ముఖంలో చక్రాల్లాంటి కళ్ళు భీత హరిణేక్షణను గుర్తుకు తెస్తుంటే, సన్నటి నాసికా పుటాల నుంచి బరువైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, ఆమె ఎదపొంగుల్ని అంతగా కదిలిస్తున్నాయి. చిన్న, కొనతేలిన గడ్డం ఆమె స్థిర నిర్ణయానికి ప్రతీకలా ఉంది. సన్నటి మెడ క్రితం రాత్రి అతను కట్టిన మాంగల్యాన్ని అపురూపంగా ధరిస్తున్నట్టు పచ్చగా మెరుస్తోంది.

నున్నటి భుజాలు, పట్టుచీరలోనుంచి ఉబికి వస్తున్న అందాలు అతని నిగ్రహానికి పరీక్ష పెడుతున్నాయి. కనిపించీ కనిపించకుండా, 'నీ పిడికిలిలో ఇమిడిపోవటానికి సిద్ధంగా వుంటే, ఇంకా ఆలస్యం చేస్తావెందుకు?' అని ఒంపులు తిరిగి ప్రశ్నిస్తోంది ఆమె నడుము. సిద్ధహస్తుడైన శిల్పి అహోరాత్రులు నిద్రాహారాలు త్యజించి మలిచిన అపురూప శిల్ప ప్రతిమలా, సర్వాంగ సుందరంగా, సజీవంగా ముందు నిలిచిన ఆ స్త్రీ మూర్తిని అలాగే చూస్తూ తనని తాను నిగ్రహించుకోలేక అమాంతం ఆమెను రెండు చేతుల్లోనూ పొదువుకుని గుండెలకు హత్తుకోవాలని, ఆమెను తనలో ఐక్యం చేసుకోవాలని ముందుకు రెండడుగులు వేశాడు అనిల్.

ఆమె చాలావేగంగా, అతని ముఖంలోకి చురుగ్గా చూసింది. అనిల్ మరో అడుగు వెయ్యలేదు. తనని తాను అదుపులోకి తెచ్చుకున్నాడు.

మృదువైన స్వరంలో లాలిత్యాన్ని నింపుకుని అన్నాడు!

"రా హరితా, అక్కడే నిలబడిపోయావేం...?"

హరిత నిల్చున్న చోటునుంచి కదల్లేదు. అతను తన ఇష్టానికి వ్యతిరేకంగా తనను బలవంతంగా దగ్గరకు తీసుకుని వుంటే ఆ క్షణమే తలుపులు తెరుచుకుని బయటకు పారిపోయి వుండేది. కాని, ఉన్నతమైన అతని వ్యక్తిత్వం, సంస్కారం–ఆమె మంకుపట్టును

కొద్దిగా సడలించాయి.

నెమ్మదిగా అడుగులువేసి వచ్చి, "పాలు చల్లారిపోతున్నాయి, తాగండి" అన్నది.

అనిల్ చెవుల్లో అమృత సోనల్ని వర్షించా యామె మాటలు.

పాల గ్లాసునందుకుని సగం తాగి గ్లాసును ఆమె కందించబోయి టీపాయ్ మీద పెట్టే శాడు అనిల్. ఆమె ఆ గ్లాసు నందుకోలేదు. తక్కిన పాలను తాగమని అతనడగలేదు.

రాజేష్ మాటలు అతని చెవుల్లో గింగురు మంటున్నాయి.


"నా చెల్లెలని చెప్పటం కాదుగాని, హరిత చాలా మంచి పిల్లరా...ఎందుకో మొదట్నుంచీ మగాళ్ళంటే ఆమెకు గిట్టదు. వయసు వచ్చిం తర్వాత తన స్వభావంలో మార్పు వస్తుందను కున్నా. కాని వయసుతో బాటు పురుష ద్వేషం కూడా పెరుగుతూ వచ్చింది. ఇన్నాళ్లు పెళ్ళి ప్రస్తావన తెస్తేనే మండిపడింది. నేనే ధైర్యం చేసి నిన్న పెళ్ళి చూపులకు ఆహ్వానిస్తున్నాను – నా చెల్లెలు కదా అని మొహమాటాలతో ఈ పెళ్ళికి ఒప్పుకోమని అడగటం లేదు. నువ్వు మనస్ఫూర్తిగా ఒప్పుకుంటేనే ఈ పెళ్ళి జరుగు తుంది." అన్నాడు రాజేష్–పెళ్ళి చూపులకు ముందు.

పెళ్ళిచూపులు ముగిశాక హరిత అంగీకా రాన్ని అనిల్‌కి చెపుతూ అన్నాడు రాజేష్. "నీవంటి గొప్ప వ్యక్తి భర్తగా లభించటం నా చెల్లెలు చేసుకున్న పుణ్యంరా. నువ్వంటే ఎంతో ఎంతో ఇష్టపడుతోందిప్పుడు. కాని తన మనసు గాజుబొమ్మ లాంటిది. ఎట్టి పరిస్థితుల్లోను పగలనివ్వకుసుమా!"

ఇప్పుడు శోభనం గదిలో ఆమెను చూస్తుంటే – మనసే కాదు, మనిషి కూడా గాజు బొమ్మలాగానే వుందనిపించింది అనిల్‌కి.

"అలా కూచో హరితా!... ఊ...నీ చదువు కున్న రోజుల ముచ్చట్లేమైనా చెప్ప, వింటాను. నా గురించి కూడా ఇంకా ఏమైనా తెలుసు కోవాలంటే నిర్మొహమాటంగా నిరభ్యంతరంగా అడుగు, చెప్తాను. మనిద్దరం ఈనాటి నుంచి జీవితాన్ని పంచుకుంటున్నాం. మన అభిరుచుల్ని ఇష్టాయిష్టాలనీ అన్నీ మనసువిప్పి మాట్లాడు కుందాం. సరేనా...!?" అన్నాడు అనిల్ ఆమె ముఖంలోకి చూస్తూ.

హరిత అప్పటికీ మౌనం వీడలేదు. పక్క మీద కూచోలేదు. ఆమెను అమాంతం రెండు చేతులతోను చుట్టేసి గుండెలకు హత్తుకుని




పక్కమీద పరుండ చేయాలని మనసును కాల్చే స్తున్న కోరికను మధ్యలోనే అణుచుకున్నాడు.

"పోనీ, మంచం మీద కాకపోతే ఈ కుర్చీలో కూచో! నేనిన్ని మాటలు మాట్లాడుతున్నా నువ్వు పెదవి విప్పి ఒక పలుకైనా పలకటం లేదు. నీ మాటల్లో దొర్లిపడే రత్నమాణిక్యాలు, నవ్వితే రాలిపడే ముత్యాలు ఏరేసుకుంటానని భయమా?" అన్నాడు.

ఆమె పెదాలు సన్నగా విచ్చుకున్నాయి. ఇందా కటి బెరుకు, కొత్తదనం కొంత తగ్గాయి. అనీ అనవట్టుగా సుతారంగా పరువుకు ఆనుకుని నిల్చుంది.

"నువ్వు చాలా అందంగా ఉన్నావు హరితా! బాహ్య సౌందర్యాన్ని మించిన నీ వ్యక్తిత్వం, స్థిరమైన మనస్తత్వం నన్నెంతో ఆకర్షించి ఆక ట్టుకున్నాయి. నేను నీవాడ్ని హరితా! నా దగ్గర నీకెలాంటి సంకోచం, బిడియం అక్కర్లేదు. ఏ విషయాన్నయినా నిర్భయంగా ముక్కుకు మాటిగా అడగవచ్చు. నీ గురించి నేను, నా గురించి నువ్వు ఎన్నో విషయాలు అడిగి తెలు సుకోవచ్చు. ఒకరినొకరు ఎంత బాగా అర్థం చేసుకుంటే అంత బాగా మన సాంసారిక జీవితం హాయిగా ఆనందంగా గడచిపోతుంది ఏమైరైట్..? అన్నాడు అనిల్.

అనిల్ అందరి మగాళ్ళవంటి వాడు కాదని కొండంత సంస్కారాన్ని ఉన్నత వ్యక్తిత్వాన్ని స్వంతం చేసుకున్న వ్యక్తి అనీ హరితకు అర్థమైపోయింది. ఇంకా మౌనం వహించటం ఆమెకే మంచిగా అనిపించలేదు.

"మీ గురించి చెప్పండి, వింటాను. "అన్నది మృదువుగా. తానాశించిన మార్పు ఇంత తొంద

రగా వస్తుందని ఊహించని అనిల్ ఆ రెండు మాటలకే పరవశించిపోయాడు.

"అలాకూచో హరితా, ప్లీజ్...నేను దుర్మార్గు డిలా, రాక్షసుడిలా కనిపిస్తున్నానా?" అనిల్ చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"ఛ, ఛ, అలా ఎవరన్నారండీ..." అంటూ సుతారంగా పరుపు చివర కూచుంది హరిత.

తను ఆమెకు ఎడంగా పరుపు మీద కూచుని, "నీ అభిప్రాయాలు అభిరుచులు చెప్ప హరితా! నేను భవిష్యత్తులో ఎప్పుడూ నీ మనసుకు బాధ కలిగించే పని ఏదీ చెయ్యను. నీ అంగీ కారం లేకుండా ఎలాంటి స్వయం నిర్ణయాలు తీసుకోను. నీ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ప్రవ ర్తించను. నీ అభిప్రాయాల్ని గౌరవిస్తాను. నా స్వంత అభిప్రాయాల్ని, నిర్ణయాల్ని నీ మీద రుద్దను." అన్నాడు.

హరిత మౌనంగా అతను చెప్తున్న మాటల్ని వింటోంది. అతని మాటల్లో ధ్వనిస్తున్న సిన్సి యార్టీని, నిజాయితీని గుర్తించింది. స్త్రీలను అణగదొక్కే పురుషాధిక్యత గల సమాజాన్ని మాత్రమే ఆమె ఇంతవరకు చూసింది. స్త్రీ కూడా సాటి ప్రాణి అని, ఆమెకు స్వంతంగా ఆలోచించే శక్తి, ప్రతిస్పందించే మనసు, నిర్ణ యాలు తీసుకునే హక్కు, వ్యక్తిత్వం ఉంటా యని గ్రహించిన మొట్టమొదటి పురుషుడు అనిల్–తనభర్త!..ఆమెకు చాలా గర్వంగా అని పించింది, అనిల్‌ని తలచుకుంటూంటే.

"ఈ కాలం ఆడపిల్లలు చాలా స్పీడుగా వుంటారని, అందులోను గ్రాడ్యుయేషన్ చేసిన అమ్మాయిలు ఫాస్ట్‌గా ఉంటారని అనుకునే వాడ్ని. చదువుకునే రోజుల్లో అమ్మాయిల గురించి ఆలోచించే వ్యవధి నాకుండేది కాదు.

ఎంతసేపూ నా చదువు ధ్యాసే! చార్టర్డ్ అకౌంటెన్సీ చేయాలనే కోరికతో బి.కాం. చదివాను. మారుతున్న విలువల్ని, వేగంగా దూసుకుపోతున్న కాలాన్ని చూసి, ముందు ఏదోక పాయింట్ దగ్గర స్థిరపడితే, తర్వాత నేననుకున్న గమ్యం చేరుకోవచ్చునని అనిపించింది. రాసిన మొదటి పరీక్షకే బ్యాంక్ ఆఫీసరుగా సెలక్టయ్యాను. వెంటనే ఉద్యోగంలో చేరాను. ఇక నీ సాహచర్యంలో నేననుకున్న సి.ఏ. సాధించగలననే నమ్మకం నాకుంది" అన్నాడు అనిల్.

"అయితే బొత్తిగా బుద్ధిమంతులన్నమాట!" చటుక్కున అనేసి నాలుక్కరచుకుంది హరిత.

అనిల్ నవ్వేసి, "నిజంగా బుద్ధిమంతుడ్నే హరితా! పెళ్ళికి ముందుగాని, తర్వాతగాని వివాహేతర సంబంధాల్ని నేనసహ్యించుకుంటాను. పవిత్రత, సచ్ఛీలత ఆడవాళ్ళకు మాత్రమే పరిమితం చేసి, విచ్చలవిడిగా తిరిగే మగాళ్ళను నేను ఏవగించుకుంటాను. స్త్రీలను అణగదొక్కే పాశవిక సంస్కృతిని ఇంకా మన సమాజం దూరం చేసుకోకపోవటం దురదృష్టకరం" అన్నాడు.

ఆ మాటలతో హరిత మనసును మరింత దోచుకున్నాడు అనిల్. ఆమె మనసుకు అడ్డుగా వున్న ఏవో తెరలు ఒకటొకటి జారిపోతున్నాయి. ఏళ్ళ తరబడి పాతుకుపోయి, ఘనీభవించిన పురుష ద్వేషం–అనిల్ ఆలోచనల వేడిసోకి కరిగిపోతున్నది. అతనితో మనసువిప్పి మాట్లాడమని హృదయం వేగిరపరుస్తోంది.

"నేనూ చిన్నతనం నుంచి చదువే జీవితంగా గడిపాను." హరిత గళంవిప్పి మనసు పొరల్లోని ఊసుల్ని అతని ముందు పరిచింది.

"బి.ఎస్సీ చేసినా, కంప్యూటర్స్ చేసినా, ఇంకా ఎం.సి.ఏ. చేసినా అంతా స్వయంకృషితోనే. నాన్నగారుగాని, అన్నయ్యగాని, నన్నెప్పుడూ 'ఇలా చెయ్యి అలా చెయ్యి' అని ఆదేశించలేదు: నిర్బంధించలేదు. నా నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. అలాచేస్తే నేనింకా మొండికెత్తి వుండేదాన్ని. నా ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా సహించలేని మనస్తత్వం నాతో బాటు ఎదుగుతూ వచ్చింది! ఓ క్షణం ఆగింది.

"ఆ వ్యక్తిత్వమే నన్నాకర్షించింది, నీవాడ్ని చేసింది"

వెన్నెలలు కురిపించే నవ్వును సమ్మోహనాస్త్రంలా సంధించాడు అనిల్.

హరిత ఇప్పుడు సూటిగా అతని ముఖంలోకి చూస్తూ, స్వేచ్ఛగా తన అభిప్రాయాల్ని వ్యక్తపరచగలుగుతోంది. ఆ కొద్ది సేపట్లోనే అతన్నెంతో అర్థం చేసుకుంది.

తను గదిలోకి పాలగ్లాసుతో ప్రవేశించేటప్పుడు మనసులో ఎన్నో రకాలుగా ఊహించుకుంది. తను రాగానే పాలగ్లాసు అందుకుని సగం తాగి, తక్కిన పాలు తన చేత బలవంతంగా తాగిస్తాడని, తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా. బలంగా తనని సందిట బంధించి మంచం మీదికి తోసేసి తన శరీరాన్ని ఆక్రమించుకుంటాడని, తన బుగ్గల్ని పెదాల్ని కర్కశంగా రక్తం చిందేలా కొరికేస్తాడని, తన ఒంటిమీది దుస్తులన్నీ వలిచేసి లైటు వెలుగులో తనని నగ్నంగా చూసి రాక్షసానందాన్ని అనుభవిస్తాడని, గోళ్ళతో పళ్ళతో ఒళ్లంతా గాయాలు చేస్తాడని, తన కోర్కె తీర్చుకోవటం గురించి తన ఒళ్లంతా హూనం చేసేస్తాడని – ఏవేవో ఊహించుకుంది. అదే జరిగితే తను వ్యతిరేకించాలని, అతన్ని బలవంతంగా నెట్టేసి గదిలోంచి పారిపోవాలని కూడా నిర్ణయించుకుంది. అతని పురుషాధిక్యతను తీవ్రంగా నిరసించి, ఎదిరించాలనుకుంది.

కాని–ఇప్పుడు జరిగిందేమిటి? ఏమాత్రం తొందరపడకుండా, తన మనసు నొప్పించకుండా, తనని కనీసం తాకనైనా తాకకుండా, ఎంత హుందాగా మర్యాదగా ప్రవర్తిస్తున్నాడితను!? నిజంగా, మగాళ్ళలో ఇంత ఉన్నత వ్యక్తులుంటారా?

"ఏదైనా మాట్లాడు హరితా, నువ్విలా మౌనంగా వుంటే నాకేం తోచటం లేదు. ప్లీజ్, స్పీకవుట్!" అన్నాడు అనిల్.

"ఏం మాట్లాడను?.. నా స్నేహితురాలు ఒకామె భర్త శాడిజాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుంది. మరో స్నేహితురాలు తిరుగుబోతు భర్త అరాచకాన్ని కిరాతక కృత్యాల్ని ఎదిరించి డైవోర్సు తీసుకుంది. నా చిన్నతనంలోనే, మా బావ కట్నం కోసం పెట్టే వేధింపుల్ని భరించలేక, మా పుట్టింటివాళ్ళని బాధ పెట్టలేక, చివరికి అత్త ఆడపడుచుల చేతుల్లో ఆహుతైపోయింది మా అక్క! ఈ సంఘటనలన్నీ నా మనసు మీద తీవ్రంగా ముద్రపడిపోయి, మగాళ్ళ గాలిసోకితే కూడా భరించలేకపోయేదాన్ని! అందుకే పెళ్ళిచూపుల సమయంలో మిమ్మల్ని చూడటానికి కూడా మనస్కరించలేదు నాకు. కాని మీ అమృతమయమైన వాక్కు, మీ సంస్కార పూరితమైన వ్యక్తిత్వం, స్త్రీల పట్ల మీకున్న సదభిప్రాయం, పెళ్ళికొడుకు కూడా అమ్మాయికి నచ్చాలనే మీ వాదన – ఇవన్నీ ఒక్కసారిగా నాలో మగాళ్ల పట్ల పాతుకుపోయిన ద్వేషాన్ని కొద్దికొద్దిగా కరిగించాయి. పెళ్ళంటేనే మండిపడే నేను మీ వ్యక్తిత్వానికి తలవంచి, పెళ్ళికి అంగీకరించాను..." ఊపిరిపీల్చుకోవటానికన్నట్టు ఆగింది హరిత.

అనిల్ మనసులోనే హాయిగా నవ్వుకున్నాడు.

"ఓకే డియర్! చాలా రాత్రయింది. నువ్విలా పరుపుమీద నిద్రపో! నేను అలా సోఫాలో పడుకుంటాను" అంటూ దిండు తీసుకుని సోఫావైపు కదలబోయాడు అనిల్.

చటుక్కున అతని చేతిని పట్టుకుంది హరిత.

"మీరు పడుకోవలసింది సోఫాలో కాదు..." అన్నది సిగ్గుతో ముఖం అరుణిమ దాల్చగా.

అనిల్ ఆమె దగ్గరగా వచ్చి, ఆమె చుబుకాన్ని చూపుడు వేలితో పైకెత్తి, సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ, "అమ్మదొంగా! ఇంత సేపు ఈ మురిపాలనెక్కడ దాచావు?" అంటూ కొంటెగా నవ్వాడు. మనోహరంగా నవ్వింది హరిత.

అనిల్ ఆమెను సున్నితంగా దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు. ఆమెలో అనిర్వచనీయమైన పులకింత. రెండు చేతులను భర్త వీపుమీదవేసి అతని గుండెలమీద తల ఆన్చి, కళ్ళెత్తి అతని వంక చూసింది. అతని కళ్ళు అల్లరిగా నవ్వుతుంటే చూపులు వాల్చేసుకుంది. ఆమె పెదాలమీద తన పెదాలతో ముద్ర వేశాడు అనిల్. ఆమె నిలువెల్లా పులకించి పోయింది.

ఆ తర్వాత అనిల్ ఆమెను మంచం మీదకు తీసుకువెళ్ళి పరుండ బెట్టటం, ఆమె ముఖాన్ని ముద్దుల్తో ముంచెత్తడం, అతని ప్రతీ చర్యకూ ఆమె అనూహ్యంగా స్పందించడం, తనకు తెలియకుండానే భర్తకు సహకరించడం– అంతా ఓ కలలా అనిపించిందామెకు.

మనస్ఫూర్తిగా తనను తాను అర్పించుకున్న ఆ ముగ్ధురాలి గుండెల్లో వెచ్చగా తలదాచుకుని ఆమెపై పూర్తి ఆధిపత్యాన్ని సాధించాడు అనిల్. మనసిచ్చిన తన పురుషుడి సంగమంలో సర్వం మరచి, అతని ప్రేమలో కరిగిపోతూ, అనిర్వచనీయమైన ఆనందంతో పెద్దగా నిట్టూర్చి, అతనికి ఓడిపోయిందా పురుషద్వేషి – హరిత!

